క్లుప్తంగా

నేటినుంచి జామి జాతర

పాతపట్నం: ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు మండలంలోని కొరసవాడలో గల ఎల్లమ్మ ఆలయంలో జామి జాతర జరుగుతుందని గ్రామ పెద్దలు గురువారం తెలిపారు. భక్తులు మూడు రోజుల నుంచి జోగి దండి అమ్మవారికి సమర్పిస్తారన్నారు.

పత్రికలు సమాజానికి ప్రతిబింబాలు

నరసన్నపేట: పత్రికలు సమాజానికి ప్రతిబింబాలని నరసన్నపేట సీఐ జె.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక పద్మావతి డిగ్రీ కళాశాల విద్యార్థులు రూపొందించిన కళాశాల అంతర్గత పత్రిక 'జయహో'ను గురువారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఎస్ఐ దుర్గాప్రసాద్, కళాశాల డైరెక్టర్ దుర్గాప్రసాద్, అధ్యాపకుడు వై.రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యత తప్పనిసరి



సీసీ రోడ్డు నాణ్యతను పరిశీలిస్తున్న డీఈ నాగబాబు, తదితరులు

ఎల్.ఎన్.పేట: గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనుల్లో నాణ్యత తప్పనిసరిగా పాటించాలని క్వాలిటీ కంట్రోల్ డీఈ నాగబాబు అన్నారు. మండలంలోని పెద్దకొల్లివలస పంచాయతీ పరిధిలో ఉపాధి పథకం ద్వారా చేపట్టిన సీసీ రోడ్లు, డ్రైనేజీల క్వాలిటీని గురువారం పరిశీలించారు. నాణ్యత లేకుండా నిర్మాణాలు చేపడితే పనుల పర్యవేక్షణ, ఎం-బుక్ రికార్డు చేసిన అధికారుల నుంచి డబ్బులు రికవరీ చేస్తామని హెచ్చరించారు. క్వాలిటీ కంట్రోల్ ఏఈ అమృతలక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణ



వివేకానందుడి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న సర్పంచ్, తదితరులు

పొందూరు: మండలంలోని తాడివలస పంచాయతీ పరిధిలోని లత్సయ్యపేట ప్రాథమిక పాఠశాల ఆవరణలో స్వామి వివేకానందుడి విగ్రహాన్ని గురువారం ఆవిష్కరించారు. గ్రామానికి చెందిన విశ్రాంత లెక్చరర్ మెట్ట అన్నాజీ భట్లు విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. సర్పంచ్ తమ్మినేని మణెమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు సువ్వారి దివ్య, హెచ్ఎం గండెం రామారావు, పాఠశాల చైర్మన్ పైడి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పదిలో ఉత్తమ ఫలితాల సాధనకు కృషి



కేజీబీవీలో స్టోర్ రూమ్‌ను పరిశీలిస్తున్న ఏపీసీ శశిభూషణరావు

సారవకోట: పదో తరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు అన్ని చర్యలూ తీసుకుంటున్నామని ఏపీసీ డాక్టర్ ఎస్.శశిభూషణరావు తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను సందర్శించి విద్యార్థులకు పలు సూచనలిచ్చారు. మెరుగైన ఫలితాలు సాధించేందుకు ప్రణాళికాబద్ధంగా చదివిస్తున్నామన్నారు. ఏఎల్ఎస్ సీఓ జనార్దనరావు, ఎస్ఓ అరుణానాయుడు ఉన్నారు.

భూములు అప్పగించాలని వినతి

సారవకోట: మండలంలోని అగదల రెవెన్యూ పరిధిలో ఉన్న తమ భూములు అప్పగించాలని తహసీల్దార్ విజయలక్ష్మికి అలుదు గ్రామానికి చెందిన పాట్నూరు సత్యనారాయణ గురువారం వినతిపత్రం అందించారు. తమ దగ్గర పూర్తి ఆధారాలున్నాయన్నారు. పలుమార్లు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదన్నారు. తమకు చెందిన మెట్టు భూమిలో ఇటీవల కొంత మంది యంత్రాలు పెట్టి వాటిని పొలాలుగా మార్చే ప్రయత్నం చేస్తున్నారని, దీనిని పరిశీలించి తగిన న్యాయం చేయాలన్నారు.

కుళాయిలకు మోటార్లు బిగిస్తే చర్యలు

ఆమదాలవలస: పురపాలక సంఘం పరిధిలోని మున్సిపల్ కుళాయిలకు మోటార్లు బిగిస్తే చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ పి.బాలాజీ ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మోటార్లు బిగించిన వారు స్వచ్ఛందంగా తొలగించాలని, లేకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పట్టుపడిన వారినుంచి మోటారును స్వాధీనం చేసుకుంటామని, రూ.3 వేల అపరాధ రుసుం విధిస్తామన్నారు. ఇంటికి శాశ్వతంగా కుళాయి లేకుండా మూసివేస్తామన్నారు.



ప్రమాద సూచీని ధ్వంసం చేసిన దృశ్యం



నిత్యం ప్రమాదాలకు కారణమవుతున్న తూముకొండ-రామచంద్రాపురం మలుపు ఇదే..

- కానరాని హెచ్చరిక బోర్డులు
- పట్టించుకోని అధికారులు

మలుపుల్లో ప్రయాణాలు.. అరచేతుల్లో ప్రాణాలు

మెళియాపుట్టి:

ఆ మలుపులు ప్రమాదాలకు పిలుపులుగా మారాయి. హెచ్చరిక బోర్డులు లేకపోవటంతో కొత్తవారు అధికంగా ప్రమాదాలకు గురవుతున్నారు. వీటిపై సంబంధిత అధికారులు ఎటువంటి చర్యలూ తీసుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. మెళియాపుట్టి మండల కేంద్రం నుంచి పలాస వెళ్లే ముఖ్య రహదారిలో నిత్యం వాహనాల రాకపోకలు సాగిస్తుంటాయి. తూముకొండ రామచంద్రాపురం (ఆకులమ్మ ఆలయం) మలుపు అత్యంత ప్రమాదకరంగా మారింది. నిత్యం ఇక్కడ ఏదో ఒక ప్రమాదం జరుగుతూనే ఉంటుంది. సుమారు కిలో మీటరు రహదారి మలుపుతోపాటు ఎత్తైన ప్రదేశం నుంచి ఒక్కసారిగా వాహనాలు కిందికి రావాల్సి ఉంటుంది.

అటువంటి సమయాలలో అనేక వాహనాలు అదుపుతప్పి ప్రమాదానికి గురవుతున్నాయి. ఇక్కడ ప్రమాదం జరిగి అధిక శాతం మంది ప్రాణాలు కోల్పోయారు.

నాలుగు నెలల్లో 17 ప్రమాదాలు..

ఆకులమ్మ ఆలయం మలుపు వద్ద గత నాలుగు నెలల్లో 17 ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. ఇద్దరు యువకులు ప్రాణాలు కోల్పోయారు. కాలు చేతులు విరిగి, తీవ్రగాయాలతో ఎంతో మంది గట్టెక్కిన పరిస్థితులున్నాయి. పలాస రైల్వే స్టేషన్‌కు వెళ్లడానికి ఇదే ముఖ్య రహదారి కావడంతో ఎంతో మంది కుటుంబాలతో ఆటోల్లో, బస్సుల్లో ప్రయాణిస్తుంటారు. మలుపు ప్రదేశంలో పేరుగాంచిన ఆకులమ్మవారి గుడి ఉండటంతో ఆది, మంగళ వారాల్లో ఎక్కువ మంది వచ్చి పూజలు, వనభోజనాలు చేస్తుంటారు. రహదారి పక్కనే వనభోజనాలు చేస్తుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనన్న భయం నెలకొంది. కొన్నిచోట్ల ప్రమాద సూచికలు ఉన్నా ప్రయోజనం లేదని పలువురు వాహనచోదకులు వాపోతున్నారు. అత్యధిక ప్రమాదాలు జరిగే మలుపులో ఏర్పాటుచేసిన సూచీలను సైతం ఆకతాయిలు ధ్వంసం చేయడంతో వాహనచోదకులకు ప్రయాణం మరింత ప్రమాదకరంగా మారింది. సంబంధిత శాఖ అధికారులు ఈ మలుపుపై దృష్టి సారిస్తే ప్రమాదాలు నివారించవచ్చునని పలువురు కోరుతున్నారు.

భయంగానే ఉంటుంది



మాకు ఏ చిన్న అవసరం వచ్చినా మలుపు దాటి మెళియాపుట్టి మండల కేంద్రానికి వెళ్లాల్సిందే. ఈ రోడ్డులో ప్రయాణం చేయాలంటే భయంగా ఉంటోంది. కొంతదూరం వరకు అటువైపు నుంచి ఏ వాహనం వస్తుందో కనిపించదు. రాత్రి వేళల్లో అయితే ప్రయాణం చాలా కష్టం. నిత్యం ప్రమాదాలు జరుగుతుంటాయి. అధికారులు స్పందించి రహదారి పక్కన ఉన్న పిచ్చిమొక్కలు తొలగించాలి. ప్రమాదాలు జరగకుండా శాశ్వత పరిష్కారం చూపాలి.

– కొమ్ము నేతాజీ, హీరాపురం, మెళియాపుట్టి మండలం

మలుపు.. ప్రమాదానికి పిలుపు..

సరుబుజ్జిలి: ఆర్అండ్‌బీ రహదారుల్లో నిర్మించిన బస్ షెల్టర్లు రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కేంద్రంగా మారుతున్నాయి. రహదారి మలుపుల్లో షెల్టర్లు నిర్మించారు. ఈ ప్రదేశాల్లో హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు నిర్మించలేదు. ఎదురెదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. పాలవలస, మునగవలస జంక్షన్ల వద్ద గత ఆరు నెలల్లో 3 ప్రమాదాలు జరిగి పలువురు గాయపడ్డారు. అధికారులు స్పందించి స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.



మునగవలస జంక్షన్ మలుపు వద్ద బస్‌షెల్టర్



పాలవలస వద్ద నిర్మించిన బస్‌షెల్టర్

నరసన్నపేట గంజాయి మయం

- పెరుగుతున్న హత్యలు, దోపిడీలు
- పోలాకి జెడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణచైతన్య ఆందోళన



ధర్మాన కృష్ణచైతన్య

నరసన్నపేట: ప్రశాంతమైన నరసన్నపేట పట్టణంలో గంజాయి విచ్చలవిడిగా లభిస్తోందని, గంజాయి మత్తులో హత్యలు, దొంగతనాలకు పాల్పడుతున్నారని పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక గంజాయి విక్రయాలు, వినియోగం బాగా పెరిగిందన్నారు. దీనికి ఉదాహరణ.. నరసన్నపేటలో మూడు రోజుల క్రితం జరిగి న వృద్ధురాలి హత్య, దొంగతనాలేనని అన్నారు. గంజాయి అక్రమ రవాణాను అరికట్టి నరసన్నపేటలో ప్రశాంత వాతావరణాన్ని పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. నరసన్నపేట చుట్టూ గంజాయి డెన్‌లు ఉన్నాయన్నారు. పోలీసుల సోదాల్లో 20 కేజీల గంజాయి పట్టుబడటం తెలిసిందేనన్నారు. పట్టుబడకుండా అనేక మంది ఉన్నారని, దీనిపై నిఘా పెంచాలన్నారు. కొందరు స్వార్థపరులు స్వలాభం కోసం గంజాయిని మత్తులో యువతను ముంచుతున్నారన్నారు. పోలీసు అధికారులు ఉక్కుపాదం మోపి యువత చెడు మార్గాల వైపు మళ్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

మెగా డీఎస్సీ ప్రకటనలకే పరిమితమా?

- మెడికల్ మాఫియాను అరికట్టాలి
- ఏఐవైఎఫ్ డిమాండ్



మాట్లాడుతున్న ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు యుగంధర్

నరసన్నపేట: ఎన్నికల ముందు మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తామని కూటమి నాయకుల హామీలు ప్రకటనలకే పరిమితం చేస్తున్నారని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మొజ్జాడ యుగంధర్ ప్రశ్నించారు. స్థానిక ప్రైవేట్ కళాశాలలో గురువారం విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 9 నెలలు పూర్తయినా ఇదుగో, అదిగో అంటూ ప్రకటనలే తప్ప.. ఆచరణలో కనిపించడం లేదని విమర్శించారు. వెంటనే మెగా డీఎస్సీ నిర్వహించి నిరుద్యోగ యువతను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మరోవైపు ఉపాధ్యాయ పోస్టులు తగ్గిస్తూ కొన్ని పోస్టులకే డీఎస్సీ పరిమితం చేయాలని ప్రభుత్వం చూస్తోందని, ఇది సరైన పద్ధతి కాదన్నారు. శ్రీకాకుళంలో మెడికల్ మాఫియా పెచ్చుమీరుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్ఎంపీలు నుంచి వైద్య నిపుణుల వరకు రోగుల నుంచి ఎంత వీలైతే అంత దండుకోవడానికి చూస్తున్నారని, అవసరం లేని టెస్టులు, స్కానింగ్‌లు చేసి రోగుల జేబులు గుల్ల చేస్తున్నారన్నారు. జిల్లాలో అన్నిచోట్లా ఈ మాఫియా కొనసాగుతుందన్నారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ, వైద్య శాఖ అధికారులు దీనిపై దృష్టి పెట్టి పేద రోగులను కాపాడాలని కోరారు. ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.సంతోష్, కొన్న శ్రీనివాసరావు, నాయకులు ఆర్.అరవింద్, పి.వాసు, వై.వేణు ఉన్నారు.

'పది' ప్రశ్నపత్రాలు వచ్చేశాయ్..



సారవకోట పోలీస్ స్టేషన్‌కు గురువారం 10వ తరగతి ప్రశ్నపత్రాలు చేరాయి. సారవకోట, బుడితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో 521 మంది విద్యార్థులు 10వ తరగతి పరీక్షలు రాయనున్నారు.వీరి కోసం సెట్-1 ప్రశ్నపత్రాలు చేరాయి. వాటిని ఎంఈఓ ఎం.వి.రమణ, పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ మాధవరావు, డీఓ కాంతిరాజ్ ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్లో భద్రపర్చారు. – సారవకోట

నేత్ర చికిత్సలకు 22 మంది ఎంపిక



నరసన్నపేటలోని చిత్తిరివీధిలో సత్యసాయి మందిరం వద్ద గురువారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 91 మంది కంటి పరీక్షలు చేపట్టి 22 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. శంకర్ ఫౌండేషన్, జిల్లా అంధత్వనివారణ సంస్థ సౌజన్యంతో సత్యసాయి సమితి ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రి వైద్యులు కృష్ణానాథ్, జలుమూరు ఆప్తాలమిక్ అసిస్టెంట్ బాలగంగాధరరాజు, సత్యసాయి సమితి ప్రతినిధులు మూర్తి, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. – నరసన్నపేట

ఎండి'నది'



పాతపట్నం సమీపంలోని ప్రధాన సాగు, తాగు నీటి వనరైన మహేంద్ర తనయ నది ఎండిపోయింది. సీది వంతెన వద్ద గురువారం ఇలా దర్శనమిచ్చింది. ఒడిశా (పర్లాకిమిడి) వద్ద తాగునీటి కోసం నదికి అనకట్ట వేయడంతో నీటి ప్రవాహం తగ్గుముఖం పట్టిందని పాతపట్నం, కొరసవాడ, కాగువాడ, సీది ప్రజలు చెబుతున్నారు. – పాతపట్నం

ఆశాజనకంగా నువ్వు పంట



ఈ చిత్రం ఎల్.ఎన్.పేట మండలం పరిధిలోని మిరియాపల్లి ప్రాంతంలో ఆశాజనకంగా ఉన్న నువ్వు పంట. నూనె గింజలు, వాణిజ్య పంటల్లో ప్రధానమైన నువ్వు పంట ఆరుతడిగా వేస్తారు. డిసెంబర్, జనవరి నెలల్లో దుక్కి చేసి నువ్వు విత్తనాలు వేశారు. సిద్ధాంతం, బరటాం, సుమంతాపురం, కృష్ణాపురం, కరకవలస, బొర్రంపేట, ముంగెన్నపాడు, దబ్బపాడు, వాడవలస, లక్ష్మీనర్సుపేట, బసవరాజుపేట, మిరియాపల్లి, ధనుకువాడ, రావిచెంద్రి, బొత్తాడసింగి, యంబరాం, జాడుపేట, కొమ్మువలస, స్కాట్‌పేట, మోదుగువలస, జంబాడ తదితర గ్రామాల్లో నువ్వు పంట సాగు చేస్తున్నారు.

– ఎల్.ఎన్.పేట

రాజుల చెరువు సుందరీకరణకు కసరత్తు



రాజుల చెరువును పరిశీలిస్తున్న తహసీల్దార్

నరసన్నపేట: స్థానిక రాజుల చెరువు సుందరీకరణకు అధికారులు మళ్లీ కసరత్తు ప్రారంభించారు. శ్రీకాకుళం ఆర్డీఓ సాయి ప్రత్యూష నరసన్నపేట తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఈ మేరకు సమీక్ష చేపట్టారు. సాధ్యాసాధ్యాలపై తహసీల్దార్ సత్యనారాయణ, ఏపీఓ యుగంధర్, ఇరిగేషన్ ఏఈ శిమ్మ శ్రీనివాసరావు, ఆర్కియాలజీ ప్రతినిధి పాగోటి అశోక్, ఉద్యావన శాఖ ఏఓ బగ్గు యామిని తదితరులతో చర్చించారు. ఈ మేరకు డీపీఆర్ తయారు చేస్తున్నట్లు సమాచారం. అనంతరం తహసీల్దార్ నేతృత్వంలో వివిధ శాఖల అధికారులు చెరువును పరిశీలించారు. ఈ చెరువు గొట్టిపల్లిలో సర్వే నంబర్ 219లో పూర్వం 124 ఎకరాలు ఉండగా.. ప్రస్తుతం 13 ఎకరాలు మాత్రమే గ్రామ కంఠంగా ఉంది. సర్వేయర్ అప్పలస్వామి, ఆర్ఐ సాయి, వీఆర్వో శ్యామ్ తదితరులు ఉన్నారు.

చెరువు ఆక్రమణలపై కేసులు..

గత పదిహేను ఏళ్లుగా రాజుల చెరువు సుందరీకరణకు ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నా.. కార్యరూపం దాల్చడం లేదు. చెరువు చుట్టూ ఆక్రమణలు పెరుగుతున్నాయి. మరోపక్క ఆక్రమణలపై చెన్నైలోని ఎన్‌జీటీ కోర్టులో వివాదం నడుస్తోంది. హైదరాబాద్‌కు చెందిన గరీబ్ గైడ్ స్వచ్ఛంద చెరువులోని ఆక్రమణలు తొలగించి పూర్వ వైభవం తీసుకురావాలని పిటీషన్ వేసింది. దీనిపై పలు మార్లు వాదనలు జరిగాయి. ఇప్పుడు చెరువు సుందరీకరణపై ఆర్డీఓ సాయి ప్రత్యూష సమీక్ష చేయడం ఆసక్తి కల్పిస్తుంది.

ఉన్నతాధికారులకు నివేదిస్తాం

జలుమూరు: జాతీయ రహదారి విస్తరణలో మండలంలోని చల్లవానిపేట, లింగాలవలస గ్రామాల్లో ఇళ్లు, దుకాణాలు నష్టపోయిన వారి సమస్యలను ఉన్నతాధికారులకు నివేదించనున్నామని ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ ఎం.లావణ్య అన్నారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో బాధితులతో మాట్లాడారు. రోడ్డు విస్తరణలో ప్రభుత్వం పరంగా నష్టపరిహారం అందించాలని బాధితులు కోరారు. ఇళ్లు పూర్తిగా కోల్పోయిన వారికి ఇళ్లు మంజూరు చేయాలని విన్నవించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ జెన్ని రామారావు, ఆర్ఐ కిరణ్, సిబ్బంది ఉన్నారు.

యువకుని అదృశ్యం



అల్లాడ శంకర్

బూర్జ: మండలంలోని పాలవలస గ్రామానికి చెందిన అల్లాడ శంకర్ (30 ఏళ్లు) ఈ నెల 3వ తేదీ నుంచి కనిపించడం లేదని తండ్రి అల్లాడ అప్పలనాయుడు గురువారం స్థానిక పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎం.ప్రవల్లిక తెలిపారు. శంకర్ శ్రీకాకుళంలోని టాటా ఫైనాన్స్ కంపెనీలో లోన్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్నాడని తెలిపారు. అవివాహితుడు. అప్పులు చేసి గ్రామంలో రెండు అంతస్తుల ఇల్లు కట్టాడు. బాధితులు ఇంటికి వచ్చి అప్పు చెల్లించాలని అడిగేవారు. బాధ తాళలేక ఇల్లు వదలి వెళ్లిపోయి ఉంటాడని కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. స్నేహితులు, బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తండ్రి తెలిపారు.

గిరిజనులకు మద్యం దుకాణాలు కేటాయించాలి



మాట్లాడుతున్న వాబ యోగేశ్వరరావు

సారవకోట: గీత కార్మికులు, సొండి కులస్తులకు మద్యం దుకాణాలు కేటాయిస్తున్న మాదిరిగానే గిరిజనులకు కూడా మద్యం దుకాణాలు కేటాయించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగేశ్వరరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో విలేకర్లతో మాట్లాడారు. ఎక్సైజ్ అధికారులు గిరిజన గ్రామాలోల దాడులు నిర్వహించి నాటు సారా తయారు చేస్తున్నారనే నెపంతో గిరిజనులపై తప్పుడు కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. దీనివలన పలువురు గిరిజనులు అవమానం తట్టుకోలేక ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంఘం సభ్యులు జన్ని దాలయ్య, బాలకృష్ణ, కృష్ణారావు, నాగేశ్వరరావు, తదితరులు ఉన్నారు.

వర్మీ కంపోస్టు తయారీపై అవగాహన

హిరమండలం: వర్మీ కంపోస్టు ఎరువుల తయారీపై అవగాహన కలిగి ఉండాలని టెక్కలి డివిజనల్ పంచాయతీ అధికారి ఆర్.గోపిబాల అన్నారు. గురువారం హిరమండలం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద ఘన వ్యర్థ నిర్వహణపై కొత్తూరు, హిరమండలం, సురుబుజ్జిలి, ఎల్.ఎన్.పేట, పాతపట్నం మండలాలకు చెందిన పంచాయతీ విస్తరణ అధికారులు, కార్యదర్శులు, గ్రీన్ అంబాసిడర్లు, గార్డులకు వర్మీ కపోస్టు ఎరువుల తయారీపై ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎస్‌డబ్ల్యూపీసీలను వినియోగంలోకి తీసుకురావాలన్నారు. వర్మీ కంపోస్టు తయారీపై డీపీఆర్‌సీ రిసోర్స్ పెర్సన్ సాగర్ కుమార్, ఎం.ప్రసాద్ శిక్షణ ఇచ్చారు. ఎంపీడీఓ ఆర్.కాశీప్రసాద్, ఈఓపీఆర్‌డీ గోవిందరావు, మేజర్ పంచాయతీ ఇన్‌చార్జి కార్తీక్, తదితరులు ఉన్నారు.

రామ మాలధారణ



పూజలు నిర్వహిస్తున్న రామ భక్తులు

ఎల్.ఎన్.పేట: మండలంలోని మోదుగువలస (చిన్నకొల్లివలస) వంశధార పునరావాస కాలనీలో నిర్మించిన కోదండ రామాలయం ప్రతిష్ట సందర్భంగా గ్రామానికి చెందిన పలువురు గురువారం రామ మాలను ధరించారు. ఈ నెల 8, 9, 10 తేదీల్లో రామాలయ ప్రతిష్ట మహోత్సం నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు, గ్రామానికి చెందిన ఎంపీపీ రెడ్డి జ్యోతిలక్ష్మి, సర్పంచ్ రెడ్డి రామారావు తెలిపారు. ప్రతిష్ట మహోత్సవం పూర్తయ్యేవరకు రామ మాల ధారణలోనే ఉంటామని భక్తులు తెలిపారు. ప్రతిష్ట మహోత్సవానికి పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివాలని కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు.

రెండు బైక్‌లు ఢీ

- ఇద్దరికి గాయాలు



ఘటనా స్థలంలో క్షతగాత్రులు

మెళియాపుట్టి: రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరి యువకులకు గాయాలైన ఘటన గురువారం సాయంత్రం మండలంలోని కొసమాల గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. రట్టిని గ్రామానికి చెందిన బుల్లిబాబు బైక్‌పై మెళియాపుట్టి వైపు వస్తున్నారు. బీహార్ రాష్ట్రానికి చెందిన సోను, బోలో అనే ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై మెళియాపుట్టి నుంచి ఒడిశా రాష్ట్రం పర్లాఖిమిడి వైపు వెళుతున్నారు. కొసమాల వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. బుల్లిబాబు, సోను గాయపడ్డారు. స్థానికులు 108కి ఫోన్ చేశారు. 108 సిబ్బంది వచ్చి క్షతగాత్రులను పర్లాఖిమిడి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పరీక్ష సామగ్రి పంపిణీ

ఆమదాలవలస: పట్టణ శివారులో తాళ్లవలస వద్ద గల కేజీబీవీలో పదో తరగతి చదువుతున్న 145 మంది విద్యార్థినులకు అక్కులపేట-వేణమ్మపేట సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో సమకూర్చిన పరీక్ష మెటీరియల్‌ను జిల్లా మెడికల్ ఇన్‌చార్జి డాక్టర్ పి.తాతయ్యలు గురువారం అందజేశారు. పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించేవారికి బహుమతులు అందజేస్తామని ప్రకటించారు. సత్యసాయి సేవా సమితి జిల్లా గ్రామ సేవా ఇన్‌చార్జి మునగవలస రవీంద్రబాబు, జిల్లా జాయింట్ యూత్ కో ఆర్డినేటర్ సాయికృష్ణ, ప్రిన్సిపాల్ శిరీష, తదితరులు పాల్గొన్నారు.



పరీక్షల మెటీరియల్‌తో విద్యార్థులు

కొత్త చెరువులో ఆక్రమణల తొలగింపు



గుంతలు తవ్వించిన దృశ్యం

పాతపట్నం: మండలంలోని ప్రహరాజపాలెంలో ఉన్న కొత్త చెరువులో అక్రమణలను తొలగించినట్లు తహసీల్దార్ ఎస్.కిరణ్‌కుమార్ గురువారం తెలిపారు. ఆక్రమణలు జరిగిన చోట, చదును చేసిన స్థలంలో గుంతలను తవ్వించినట్లు చెప్పారు. ప్రహరాజపాలెం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 18లో 9.20 ఎకరాల విస్తీర్ణం గల కొత్త చెరువులో ఆక్రమణలు జరిగాయని ఫిర్యాదులు వచ్చాయన్నారు. చెరువు ఆక్రమణలను పూర్తిస్థాయిలో తొలగించి హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేస్తామన్నారు.